క్లుప్తంగా

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతర సందర్భంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, పెబ్బేరు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. దుకాణాలలో వస్తువుల కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగాయి.

ఫ్లెక్సీలు తొలగించాలి

కొల్లాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ల వెంట ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఎస్‌ఎల్‌వీఆర్‌డీ సంస్థ నిర్వాహకులు కట్టా శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను కోరారు. ఆదివారం డివైడర్‌కు ఆనుకొని ఉన్న ఫ్లెక్సీ బోర్డు విరిగి తిరుపతిరావు అనే వ్యక్తికి గాయాలవడంతో ఆయన బాధితుడిని పరామర్శించి మాట్లాడారు. ఎన్టీఆర్ చౌరస్తాతో పాటు పలు కూడళ్లలో డివైడర్ చివరన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, వాహనాలను యూటర్న్ చేసే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అధికారుల స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తెలకపల్లి: భువనగిరి గురుకులంలో ఇటీవల విద్యార్థినులు భవ్య, వైష్ణవి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నాగర్‌కర్నూల్ మహిళా కన్వీనర్ సృజన డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో బీఎస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ విద్యార్థులను మృతి కలిచివేసిందన్నారు. తక్షణమే విచారించి నిందితులను శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు శివశంకర్, నాయకులు బాలనాగయ్య, మొగులాలు, రామస్వామి, రాజేష్, శివుడు, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

బల్మూర్: మండలంలోని బాణాల గ్రామానికి చెందిన మ్యాదరి నిరంజన్‌కు సంబంధించిన పూరి గుడిసె ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం బాధితుడు తన కుటుంబసభ్యులతో కలిసి పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పు అంటుకుంది. స్థానికులు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ప్రమాదంలో వంట సామాగ్రి, దుస్తులు ఇతర వస్తువులు కాలిపోయాయని బాధితులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దకొత్తపల్లి: మండలంలో సోమవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు పనులు చేపట్టడంతో విద్యుత్ లైన్ల మార్పు, చెట్ల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి శివారులలో ఉన్న చెన్నకేశవస్వామి ఉత్సవాలను ఈనెల 22 నుంచి 24 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాలయం ఆవరణంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గ్రామానికి చెందిన ఎన్నపోతుల వెంకటయ్య విడుదల చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు



పెంట్లవెల్లి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతో పాటు హెల్మెట్ ధరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

గ్రామీణ రోడ్లు అధ్వానం

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



తాడూరు–ఉప్పునుంతల బీటీ రోడ్డు ఇలా..



నల్లచెరువు కట్టపై ఉప్పునుంతల- కొత్తరాంనగర్ రోడ్డు

ఉప్పునుంతల: మండలంలో గ్రామాలను కలుపుతూ అనుసంధానంగా నిర్మించిన రోడ్లు అధ్వానంగా తయారయ్యారు. గుంతలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అధికారుల చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ప్రమాదాలభారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు.

గుంతలమయంగా మట్టి రోడ్లు

మండల కేంద్రం నుంచి శివారు గ్రామమైన కొత్త రాంనగర్ వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్ వరకు ఉన్న మట్టిరోడ్డు, మొల్గర నుంచి ఉప్పునుంతల వరకు ఉన్న మట్టిరోడ్లు దారుణంగా మారాయి. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర తేలడంతో దుమ్ములోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు ఉన్న ఉన్న మట్టిరోడ్డుపై గోతులుపడ్డాయి. దాసరల్లిపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు, సాండ్ క్వారీ రోడ్డు నుంచి కొరటికల్ వరకు, కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, అయ్యవారిపల్లి నుంచి తండా వరకు మట్టి రోడ్లు వెళ్లలేని పరిస్థితి. కొరటికల్ పీడబ్లూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు ఇబ్బందిగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంకర తేలడంగా ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కంకర రాళ్లతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉంది.

తూతూ మంత్రంగా మరమ్మతు

మండలంలోని బీటీ రోడ్ల వెంట తూతూ మంత్రంగా నిర్వహణ పనులు చేస్తున్నారు. పనుల నాణ్యతపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు వేసిన బీటీ రోడ్డు పనులు వంతుకుగంతేసినట్లు చేసి వదిలేశారు. బీటీ రోడ్డు అంచుల వెంట మట్టివేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాడూరు నుంచి ఉప్పునుంతల వరకు వేసిన బీటీ రోడ్డు కంకర లేసి పూర్తిగా ధ్వంసమైంది. ఈరట్వానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్ల నిర్వహణ పనులు చేపట్టడం లేదు. ఉప్పునుంతల నుంచి రాకొండ వరకు ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు వదిలేయడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మట్టి రోడ్లు, మెటల్ రోడ్లను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.2.97 నిధులు మంజూరు

మండలంలోని ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు సీఆర్‌ఆర్ నిధులు రూ. 2.97 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అదేవిధంగా కొరటికల్ నుంచి సాండ్‌క్వారీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల ఎమ్మెల్యే వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. ఉప్పునుంతల నుంచి తాడూరు వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డు రెన్యూవల్‌కు ప్రతిపాదనలు పంపించాం. గ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాలేదు.

– సందీప్‌రెడ్డి, ఏఈ, పీఆర్

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, యత్మతాపూర్, ఐతోలు గ్రామాలలో కేవీకే రావేఫ్ విద్యార్థినిలు గ్రామీణ వనరులు, ఆధునిక వ్యవసాయంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగు కోసం ఎరువుల వాడకం, విత్తనాల ఎంపిక, నేల స్వభావం, చీడపీడల నివారణ, వంటి వివిధ అంశాలను రైతులకు క్షేత్రస్థాయిలో అర్థమయ్యేమయ్యే విధంగా వివరించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వనరులు రైతులకు ఎలా ఉపయోగపడుతాయి, ప్రధాన వీధులు గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రం వంటి వివిధ అంశాలను ఫొటో ఫీచర్ ద్వార రైతులకు తెలిపారు. విద్యార్థినులు స్వాతి, వర్షిత, శిరీష, సింధూర, శ్రీలక్ష్మిరెడ్డి , రైతులు పాల్గొన్నారు.

తెలకపల్లి: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని నేల స్వభావం అనుగుణంగా పంటలు సాగుచేయాలని పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం మండల ంలోని పర్వతాపురంలో రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలపై ప్రదర్శన నిర్వహించారు. భూసార పరీక్షల మట్టి సేకరణ నమూనాను రైతులకు వివరించారు. మట్టి నమూనాలు తీసుకుని అందులోని పోషకాలు, సూచిక, లవణ సూచిక, సేంద్రీయ కీచనం, నత్రజని, బాస్వరం, పొటాషియం, గంధకం, జింక్, బోరాన్, ఇనుము వంటి మూలకాల లభ్యత తెలుస్తుందన్నారు. ఈ సమాచారంతో ఆ నేలల్లో ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో ఉపయోగించాలి, ఎలాంటి పంటలు సాగు చేయాలనే విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు ద్వారకామయి, విశ్వతేజ, అనూజ, సుభద్ర, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న దేవనికుమార్

కొల్లాపూర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహాయించి మిగతా వాటి అమలు పట్ల ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. రైతు బంధు ఇంకా పూర్తిస్థాయిలో రైతుల ఖాతాలో జమ చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం గృహజ్యోతి పథకాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఈ ప్రక్రియ దరఖాస్తుల స్వీకరణ వరకే ముందుకు సాగుతుందని, ఎన్నికల కోడ్ పేరుతో మరికొన్ని నెలల పాటు ఈ పథకం నిలిపివేస్తారని విమర్శించారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పన దినోత్సవం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాత ఆత్మార్పన దినోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాత సేవలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, వాసవీమాత పారాయణం, కుంకుమార్చన చేశారు. అనంతరం వేదమంత్రాలతో హోమం నిర్వహించి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీకన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్ బాబు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, అడిషనల్ సెక్రెటరీ శ్రీధర్, ప్రచార కార్యదర్శి రాజయ్య, విజయభాస్కర్, శేఖర్, కృష్ణయ్య, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

మన్ననూర్: ఆర్యవైశ్యుల్లో శాంతిని నెల కొల్పడం కోసం కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణం చేసుకుందని మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కుల ఆరాధ్య దైవం కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణం దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కుల దేవత చిత్రపటానికి పూలమాల వేసి కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు వెంకటరమణ, సత్యనారాయణ, శివాజీ, మంజుల, లక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని గిరిజన భవనంలో ఆదివారం గిరిజన సేవా సంఘం, ఉద్యోగ సంఘం, యువజన సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన సేవా సంఘం అధ్యక్షుడిగా లచ్చు నాయక్, ప్రధాన కార్యదర్శిగా దగ్గానాయక్, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా ఛత్రునాయక్, కోశాధికారిగా నాగనాయక్, ఉపాధ్యక్షుడిగా శంకర్ నాయక్, వసురాంనాయక్, ప్రచార కార్యదర్శిగా భరత్ నాయక్ పాటు తదితరులను ఎన్నుకున్నారు. అలాగే గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా శంకర్ రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిశ్వా నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజగోపాల్, ప్రచార కార్యదర్శిగా రూప్ల నాయక్ ఎన్నికయ్యారు. గిరిజన యువజన సంఘం అధ్యక్షుడిగా నరసింహ్మ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జానకిరామ్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, ఉపాధ్యాయుడిగా జయరాం, ప్రచార కార్యదర్శిగా ప్రేమ్‌లను ప్రకటించారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

లింగాల: బంజారాల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజార సూపర్ కింగ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆదివారం మేరమ్మ ఆలయం దగ్గర ఉన్న మైదానంలో ప్రారంభమయ్యాయి. మొత్తం 16 జట్లు పేర్లు నమోదు చేసుకున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్ రాథోడ్, ఏబీఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాందాస్‌నాయక్, బాలాజీ, రాజు, కిషన్, శంకర్, భద్రు, దేవేందర్, రఘుపతి, శంకర్‌లాల్, రాజలయ్య, బుడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌కొటిల్యకు డాక్టరేట్



కందనూలు/బిజినేపల్లి: బిజినేపల్లి మండలంలోని పాలెం కళాశాల సీపీడీసీ సభ్యులు ప్రతాప్‌కొటిల్యకు చైన్నైలోని గ్లోబల్ హ్యుమన్ పీస్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ వెంకటేశన్ డాక్టరేట్ పట్టాను ఆదివారం ప్రదానం చేశారు. ప్రతాప్ కొటిల్య సైన్స్‌లో చేసిన విశిష్ట సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. డాక్టరేట్ అందుకున్న ప్రతాప్ కొటిల్యను ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. డీఎస్‌ఆర్ రాజేందర్‌సింగ్, జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డా.భానుప్రకాష్‌రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నరేష్ బాబు తదితరులు అభినందించారు.

గృహజ్యోతి ఇంటింటి సర్వే

మన్ననూర్: అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్, వటువర్లపల్లి, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి గ్రామాల్లో గృహజ్యోతి పథకం అమలు కోసం విద్యుత్ అధికారులు ఇంటింటికి తిరిగి విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్నారు. వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను విద్యుత్ సిబ్బంది సేకరిస్తున్నారు. గృహజ్యోతి పథకం సద్వినియోగం చేసుకోవాలంటే విద్యుత్ మీటరు కనెక్షన్ పేరు రేషన్ కార్డులో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైన్‌మెన్ శేఖర్ గౌడ్ సిబ్బంది నిరంజన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాగత తోరణ నిర్మాణానికి భూమి పూజ

లింగాల: మండల పరిధిలోని రాయవరంలో ఆంజనేయస్వామి ఆలయం దగ్గర దాతల సహాయంతో నూతనంగా నిర్మించనున్న స్వాగత తోరణం(కమాన్)కు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎరుకలి ఎల్లమ్మ, నర్సింహ్మ జ్ఞాపకార్థం ఉల్లగొండ సునీత, రాజు కుటుంబ సభ్యులు రూ.10 లక్షల ఖర్చుతో స్వాగత తోరణ నిర్మాణం చేపట్టారు. స్వాగత ద్వారం నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతలను గ్రామస్తులు అభినందించారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాలు



రోడ్డు వెంట శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని పలు వార్డులను ఎంపీడీఓ గంగమోహన్ సందర్శించారు. ఈ నెల 15వరకు వారోత్సవాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తామన్నారు. చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువలను శుభ్రం చేయించడం, పైప్‌లైన్‌ల లీకేజీలు, వార్డులు, ప్రధాన రోడ్ల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడం దోమల నివారణకోసం ఫాగింగ్ వంటి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం



లింగాలలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి టౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా గురుకులాల అధికారి దానం తెలిపారు. పట్టణంలోని జేపీనగర్ పాఠశాల కేంద్రంలో 384 మంది విద్యార్థులకు గాను 364 మంది హాజరుకాగా, 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 456 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 24 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ డి. బాలస్వామి తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలో గురుకుల జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులకు గాను 219 మంది హాజరవ్వగా, 21 మంది విద్యార్థులు పరీక్షల హాజరుకాలేదని ప్రిన్సిపాల్ షకీలా సుల్తానా తెలిపారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని బీసీ గురుకుల సంక్షేమ పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 226 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 384 మంది విద్యార్థులకు గానూ 366 మంది పరీక్షకు హాజరు కాగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 384 మంది విద్యార్థులకు గానూ 355 మంది విద్యార్థులు పరీక్ష హాజరయ్యారు.అమ్రాబాద్ మండల తాహసీల్దార్ శ్రీకాంత్ ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో గోపద్మవ్రతం



హాజరైన భక్తులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న జ్ఞాన సరస్వతి దేవాలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రెండోరోజు నవగ్రహ హోమాన్ని వేద పండితులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన కార్యదర్శి ఎలిమేటఈశ్వరయ్య మాట్లాడుతూ గోవులను పూజించిన, సేవించిన విశేష ఫలితం ఉంటుందని, గోపద్మ వ్రతం నిర్వహించిన వారికి ముక్కోటి దేవతల ఆశీర్వాదం, అనుగ్రహం అందుతాయని అన్నారు. సామూహిక గోపద్మావ్రతంలో 81మంది మహిళలు సామూహికంగా గోపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన నిర్వహించి, భక్తులకు అమ్మవారికి నివేదించిన ప్రత్యేక నైవేద్యాలను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపువిశ్వనాథం, కార్యదర్శి ఎలిమేశ్వరయ్య శివశంకర్, ఇందుమతి, దొడ్ల నారాయణరెడ్డి, వరలక్ష్మి, పాండురంగయ్య, భక్తులు పాల్గొన్నారు.

గౌస్ మోహియొద్దీన్ సేవలు మరువలేనివి



అచ్చంపేట రూరల్: దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు గౌస్ మోహియొద్దీన్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గౌస్ మోహియొద్దీన్ జ్ఞాపకార్థకంగా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుస్తక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

న్యాయయాత్రకు ఎమ్మెల్యే మద్దతు



కల్వకుర్తి టౌన్: పాలమూరు పార్లమెంట్ పరిధిలో మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్రలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు. ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం పెంజర్ల గ్రామంలో వంశీచంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు.

కల్వకుర్తిరూరల్: ఏఐసీసీ కార్యదర్శి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గంలో కొనసాగింది. కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వంశీచందర్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. ఎల్లికట్ట మాజీ సర్పంచ్ లింగయ్య, మార్చాల సుధాకర్‌రెడ్డి, జంగయ్య గౌడ్, శైలేష్‌రెడ్డి, మోతీలాల్‌నాయక్, తదితరులు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



కొల్లాపూర్: విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీల అంశాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలు బడ్జెట్‌లో ప్రకటించలేదన్నారు. విద్యారంగానికి కేటాయించిన నిధులు కేవలం ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే సరిపోతాయని పేర్కొన్నారు. 30 శాతం నిధులు అదనంగా కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, నవీన్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కొల్లాపూర్: పట్టణంలోని స్కాలర్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చెకుముకి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటుకున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి ఆదివారం వరకు జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పృథ్వీరాజ్, తొమ్మిదో తరగతి విద్యార్థిని కే.మేఘన, ఎనిమిదో తరగతి విద్యార్థి జి.రుత్విక్ సాగర్‌లు ప్రతిభ కనబర్చారు. వీరికి ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులను స్కాలర్స్ పాఠశాల కరస్పాండెంట్ రాముయాదవ్, ప్రిన్సిపాల్ రవికుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వీల్ చైర్లు అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లిలో సత్యహరిచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు నూకం నారయ్య, కృష్ణమ్మలకు ఆదివారం ఫౌండేషన్ చైర్మన్ రాములు యాదవ్ రెండు వీల్ చైర్లును అందజేశారు. ఈ సందర్భంగా రాములు యాదవ్‌మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు శ్రీరాములు, గ్రామస్తులు పి .వెంకటయ్య, రవి, తదితరులు ఉన్నారు.